దేవాలయాలకు పాలకవర్గాల ఏర్పాటు ఎప్పుడో ?



బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం

జిన్నారం (పటాన్‌చెరు): ప్రముఖ దేవాలయాలకు పాలకవర్గాలు లేక రెండేళ్లు అవుతోంది. పలు ప్రధాన ఆలయాలకు ఈఓలు, సిబ్బందితోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. ఇందులోనూ ఈఓలకు ఏకంగా 3,4 దేవాలయాలను అదనంగా పర్యవేక్షించాల్సిన బాధ్యతలు కూడా ఉంటుండడంతో ఆయా ప్రముఖ ఆలయాల్లో పండగల సందర్భంలోనూ, ప్రత్యేక పూజల సందర్భంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈఓలు మూడు నాలుగు ఆలయాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తుండడంతో దృష్టి సారించలేకపోతున్నారని తెలుస్తోంది. శ్రావణం, కార్తీకమాసంతో పాటు పర్వదినాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు పాలకవర్గాలు లేకపోవడంతో భక్తులకు సరైన సౌకర్యాలను కల్పించలేకపోతున్నారు. రాష్ట్రంలోని కొన్ని దేవాలయాలకు పాలకవర్గం ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేసినా మధ్యలోనే ఆగిపోవడంపై మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. దీంతో జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు పాలకవర్గాలు ఎప్పుడు ఏర్పాటవుతాయోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోవలోకి బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్రస్వామి, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, రుద్రారం గణేష్ గడ్డ, కొమురవెల్లి మల్లికార్జున స్వామి, ఝురాసంఘం సంగమేశ్వర స్వామి, షేర్‌ఖాన్‌పల్లి పలుకు పోచమ్మ ఆలయం, ఇలా పలు ఆలయాలు ఉన్నాయి. ప్రభుత్వం ఆలయాల పాలకవర్గాల ఏర్పాటుపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

పటాన్‌చెరు ఎస్‌ఐగా కోటేశ్వర్‌రావు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్‌ఐగా కోటేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు.

డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు

మియాపూర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను గురువారం హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సునీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగయ్య, స్థానిక నాయకులు మహేందర్ ముదిరాజ్, రామచంద్రగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, సాయిగౌడ్, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక నాసిరకం పనులు

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

చందానగర్ : జంట సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీలలో నాసిరకంగా సీసీ రోడ్లను నిర్మించారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ క్వాలిటీ విభాగం అధికారులు ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ ఇందిరాబాయ్, శేరిలింగంపల్లి డీఈ వినయ్‌దత్, చందానగర్ డీఈ రమేష్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలో సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో 6 నెలల లోపే దెబ్బతిన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నానన్నారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బ్లాక్ లిస్ట్‌లో పెట్టి వారికి మళ్ళీ పనులు అప్పగించకూడదని సూచించారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం వలన ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని, అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ , క్వాలిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

8 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 6 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మురుగుకాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

గచ్చిబౌలి: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి డ్రైనేజీ కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శశిపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 27వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్రాడ్‌వే కంపెనీ సమీపంలో ఓ వ్యక్తి(42- 45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి డ్రైనేజీ కాలువలో పడి పోయాడు. గురువారం ఉదయం 11.30 గంటలకు నాలాలో పడి వ్యక్తి మృతి చెంది ఉన్నాడని డయల్ 100కు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాలకృత్యాలు తీర్చుకునే యత్నంలో ప్రమాద వశాత్తు నాలాలో పడి పోయినట్లు సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే 9490617127 ఫోన్ నంబర్ లేదా గచ్చిబౌలి పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నిత్యం శుభ్రతపైనే దృష్టి

చందానగర్ సర్కిల్ -21 ఏఎంహెచ్ఓ డా.రవికుమార్



చందానగర్ సర్కిల్ 21 ఏఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్



మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని చందానగర్ సర్కిల్ పారిశుద్ధ్య ప్రజారోగ్య అధికారి (ఏఎంహెచ్ఓ) డాక్టర్ రవి కుమార్ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీ, బస్తీలలో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పారిశుధ్య రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. మొబైల్ శానిటేషన్ ద్వారా నిత్యం శుభ్రతా కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు పనులను పరిశీలిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డా.రవి 'సాక్షి'తో మాట్లాడారు. చందానగర్

ప్రశ్న: సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో పారిశుధ్యం అమలు గురించి..

డాక్టర్ రవి : సర్కిల్ పరిధిలో 168 కాలనీలు, 16 బస్తీల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. కొన్ని కాలనీల్లో రాంకీ సంస్థ పనులు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో పనులను పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా...?

జ: ఇళ్లలో తడి పొడి చెత్తను వేరు చేసేందుకు ప్రతి ఇంటికీ డబ్బాలు ఇచ్చాం. కొంతమంది ప్రజలు వేరు చేసి ఇస్తున్నారు. రెండు కలిపి ఇచ్చే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించని స్వచ్ఛ ఆటోలపై చర్యలు చేపడతాం.

ప్రశ్న: వారాంతపు సంతలలో వచ్చే చెత్తను ఏ విధంగా తొలగిస్తున్నారు ?

జ: వారాంతపు సంతలలో ఏర్పడే వ్యర్థాలను తొలగించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. సంతలలో వెండర్స్ సహకారంతో కొందరిని నియమించి వారి ద్వారా చెత్త సేకరించే పద్ధతి ఒకటి, వెండర్స్ కవర్లు ఇచ్చి ఎవరి చెత్తను వారే సంచులలో వేసి, ఒక చోట చేర్చితే అక్కడి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా తొలగిస్తున్నాం.

ప్రశ్న: మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణపై..

జ: సర్కిల్ పరిధిలోని ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు వారికి కేటాయించిన కాలనీల్లో నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా సమస్య ఉంటే తక్షణ చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: చందానగర్ సర్కిల్ పరిధిలో ఎంతమంది కార్మికులున్నారు ?

జ: చందానగర్ సర్కిల్ -21లో ఒక శానిటరీ సూపర్‌వైజర్, 6 మంది ఎస్ఆర్‌పీలు, 21 మంది ఎస్ఎఫ్ఏలు, 456 మంది కార్మికులు ఉన్నారు. కార్మికులకు నైపుణ్యశిక్షణతో పాటు పని సులభతరంగా చేసేలా కృషి చేస్తున్నాం.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం పంపిణీ చేశారు. గత రెండు రోజుల్లో సుమారు 160 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఎండి ఇబ్రహీం, కాశీనాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

థీమ్ పార్కులు, ఎస్టీపీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కాలనీవాసులకు థీమ్ పార్కు నమూనాను చూపిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి/రాయదుర్గం: ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీలలో పర్యటించి ఆయా ప్రాంతాలలో చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుడాకాలనీలో 10.0 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రూ.28 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఎస్టీపీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధిలో హైదరాబాద్ నగరం ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. నల్లగండ్ల హుడాకాలనీలో థీమ్ పార్కులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలన్నారు. అలాగే నవోదయ కాలనీలో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ హుడాకాలనీ, నవోదయ కాలనీలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు చేపట్టాలని, సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్, జలమండలి మేనేజర్లు అభిషేక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరావు, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

కాయిదమ్మకుంట పనులు పరిశీలన

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలక్ట్ మాల్స్ సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చెరువు పునర్జీవనంలో భాగంగా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయిదమ్మకుంట చెరువులో మురుగు నీరు కలవకుండా ఇరిగేషన్ అధికారులు యూజీడీ పైప్‌లైన్ పనులు చేపట్టారన్నారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో ఔట్‌లెట్‌లో మురుగు నీరు వెళ్ళకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ .26 వేలు ఇవ్వాలని మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న కార్మికులకు రూ .16 వేలు ప్రభుత్వం ఇస్తున్నా, కాంట్రాక్టర్లు కేవలం రూ. 11 వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు పెంచాలంటూ మార్చిలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి నెల 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, కార్మికులు స్వామి, రవి, గోపాల్, ఇతర వర్కర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ కట్టడి చర్యలతో పరేషాన్

- అధికారులు తగు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



శేరిలింగంపల్లి: ప్రధానరోడ్డులో అక్రమ పార్కింగ్‌లను అరికట్టేందుకు చేపట్టిన నిర్ణయాలతో ఇబ్బందులు తలెత్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ ప్రధానరోడ్డులోని డీ మార్ట్ వద్ద రోడ్డుపై అక్రమంగా వాహనాలు పార్కు చేస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రోడ్డుపై 6-8 ఫీట్ల వరకు బొల్లార్డ్స్ ఏర్పాటు చేయడంతో రోడ్డు 20 ఫీట్లకే పరిమితం అవుతోంది. ప్రతి రోజు సాయంత్ర వేళల్లో నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి మీదుగా బెల్, లింగంపల్లి, పటాన్‌చెరు వైపు వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా డీమార్ట్ ఎదురుగా నియోమాల్, యూటర్న్ కూడా ఉండటంతో పోవడానికి ఇబ్బందిగా కలుగుతోందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లగండ్ల హుడా కాలనీలోని డీ మార్ట్ ఎదురుగా రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బొల్లార్డ్స్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్ : చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

– శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు బీహెచ్ఈఎల్ మెయిన్‌రోడ్డు, గౌతమీనగర్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఏరియా, శిల్పా ఎన్‌క్లేవ్, వార్డు ఆఫీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

అయ్యప్పలకు సత్కారం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీకి చెందిన శివరాజ్‌గౌడ్ నివాసంలో అయ్యప్ప మాలధారులను సత్కరించారు. అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, ప్రదీప్‌రెడ్డి, రామరాజు, దయాసాగర్, పరమేష్, గోపాల్ రావు, నవీన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

చందానగర్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో గురువారం అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ పూజకు మాదాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్‌తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, మహేష్‌యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, యాదగిరి, నాగేష్, వెంకటేష్, అర్జున్, శశాంక్, నరేష్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలంటే అంతర్జాతీయ సదస్సులు అవసరం



'ఎస్కీ'లో నిర్వహించిన సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

- కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా వైస్ చైర్మన్ డాక్టర్ నూతన్‌కుమార్ దాస్
- 'ఎస్కీ'లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి సాధించాలంటే అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ అవశ్యమని కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా వైస్‌చైర్మన్ డాక్టర్ నూతన్‌కుమార్ దాస్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో రెండు రోజుల 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇంజనీరింగ్, సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణల అవశ్యకత' అంశంపై ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఇంజనీరింగ్, సాంకేతికత రంగంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యకత, ప్రతిపాదనలు చేయడానికి సదస్సుల ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. 2030 నాటికి లక్ష్యాలను సాధించాలంటే అంతర్జాతీయ సమావేశాల అవసరం ఉందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ వివిధ సెమినార్ల నిర్వహణ ద్వారా పలు ఇంజనీరింగ్ అంశాలపై సంబంధిత శాఖలకు సూచనలు, సలహాలు ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసోసియేట్ సభ్యులు కార్పొరేట్ సభ్యులు పీఎం గుణరాజు, ఎం నాగరాజు, డాక్టర్ చౌడేగౌడ్, డాక్టర్ ఎస్ సత్యనారాయణ, సూర్యప్రకాశ్, డాక్టర్ ఐఎస్ఎన్‌రాజు, డాక్టర్ ఎస్ నాగభూషణరావు, ఉదయకృష్ణ, బ్రహ్మారెడ్డి, డాక్టర్ హనుమంతచారి, కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా అతిథులను నృత్య ప్రదర్శనతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు, అతిథులు అభినందించారు.



ఆర్టీసీ డిపోలో కార్తీక వన భోజనాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో గురువారం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి డివిజనల్ మేనేజర్ కవిత పాల్గొన్నారు. ఉద్యోగులతో సరదాగా గడిపారు. సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ ఇంజనీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



డంగుల్ బిల్లింగ్..

- కరెంటు మీటర్ల రీడింగ్‌కు కొత్త స్కానర్..
- బంజారాహిల్స్ డీఈ పరిధిలో 70 శాతం ఈ విధానం అమలు



ఫిలింనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో స్కానర్ ద్వారా కరెంటు బిల్లు తీసుకుంటున్న లైన్‌మెన్

బంజారాహిల్స్: క్షణాల్లో మీటర్ రీడింగ్ తీస్తున్నారు విద్యుత్ సిబ్బంది. విద్యుత్ మీటర్ల రీడింగ్‌ను డంగుల్ విధానం ద్వారా స్కానింగ్ చేస్తున్నారు. దీంతో బిల్లింగ్ విధానం సులభంగా మారింది. రోజురోజుకు అపార్ట్‌మెంట్ కల్చర్ పెరుగుతుండడం, ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 50 నుంచి 100 వరకు ప్లాట్లు ఉండడం, ఒక్కో ప్లాట్‌కు ఒక్కో మీటర్ , వీటి బిల్లింగ్ తీసుకోవాలంటే లైన్‌మెన్‌కు చాలా సమయం పట్టేది. ఇటీవల అద్దెల కోసం వ్యక్తిగత ఇళ్లపై కూడా అంతస్తులు పెంచుతూ కిరాయిదారులకు ప్రత్యేక మీటర్లు ఏర్పాటుచేయిస్తున్నారు. వ్యక్తిగత ఇళ్లల్లో కూడా కరెంటు బిల్లులు తీసుకోవడం చాలా సమయం పడుతుండడంతో దీనిని దృష్టిలో పెట్టుకుని టీజీఎస్‌పీడీసీఎల్ కొత్తగా సెన్సార్ మొబైల్ ఫోన్లతో మీటర్ల వద్ద స్కానింగ్ చేస్తూ త్వరితగతిన బిల్లులు నమోదు చేస్తున్నారు. బంజారాహిల్స్ డీఈ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, మాదాపూర్, ఎస్‌కేనగర్ తదితర సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ విధానాన్ని అమలుచేస్తున్నారు. ఈ విధానాన్ని డంగుల్ బిల్లింగ్‌గా పిలుస్తున్నారు.

- పాత విధానంలో బిల్లుల నమోదుకు ప్రతి నెలా 1వ తేదీన మొదలుపెడితే 15వ తేదీ నాటికి బిల్లింగ్ పూర్తయ్యేది.
- తాజాగా ప్రవేశపెట్టిన డంగుల్ బిల్లింగ్‌తో వారం రోజుల్లోనే బిల్లులు అందిస్తున్నారు.
- గతంలో బిల్లులు నమోదు చేయాలంటే ఒక్కో లైన్‌మెన్‌కు మూడు నిమిషాల సమయం పట్టేది.
- సెన్సార్‌తో కూడిన డంగుల్‌తో క్షణంలోనే బిల్లులు వస్తున్నాయి.

లైన్‌మెన్లకు ప్రత్యేక సెన్సార్‌తో అందించిన మొబైల్ ఫోన్లతో మీటర్ వద్దకు వెళ్లి ఫోన్ మీటర్ ముందు పెట్టగానే క్షణంలో బిల్లు వస్తుంది.

- బంజారాహిల్స్ డీఈ పరిధిలో 70 మంది లైన్‌మెన్లు, పనిచేస్తున్నారు. 4500 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. 20 ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక లైన్‌మెన్‌ను కేటాయించారు.
- డంగుల్ బిల్లింగ్‌తో కరెంటు బిల్లులు త్వరితగతిన రావడం, వినియోగదారులకు అందించడం, కలెక్షన్ చేయడం అంతా ప్రతినెలా 15వ తేదీ లోపు పూర్తవుతుంది. దీంతో మిగతా 15 రోజులు ఈ లైన్‌మెన్లు తమ పరిధిలోని 20 ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కేబుళ్లు, బాక్స్‌ల పనులు, లైన్లు సరిచూసుకోవడం చేస్తున్నారు.
- కొత్తగా ఏర్పాటుచేసిన డంగుల్ స్కానర్‌ను మొబైల్ ఫోన్ స్కాన్ చేయడంతో క్షణాల్లో రీడింగ్ తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.
- బంజారాహిల్స్ డీఈ పరిధిలో లక్షా 80 వేల మీటర్లు ఉండగా ప్రస్తుతం 70 శాతం మీటర్లకు డంగుల్ బిల్లింగ్‌లే ఇస్తున్నారు.
- 30 శాతం మీటర్లకు మాత్రమే పాత విధానం ద్వారా బిల్లులు అందుతున్నాయి. వాటికి కూడా త్వరలోనే డంగుల్ స్కానర్ చేస్తామని అధికారులు వెల్లడించారు.

పుస్తకావిష్కరణ

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగం, ఆలిండియా నజ్మల బలాఘా సొసైటీ సహకారంతో గురువారం అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఇరాన్‌కు చెందిన ఆధ్యాత్మిక, విద్యావేత్త, రచయిత ఆయాతుల్లా మహదీ మహదవిపూర్ మాట్లాడుతూ నహ్జుల్ బలాఘా యొక్క బోధనలు, సాంస్కృతిక ప్రాముఖ్యత గురించి చర్చించడానికి నిష్ణాతులు, ప్రముఖులను ఒక చోట చేర్చడానికి 'మనూ' చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం నహ్జుల్ బలాఘా రచించిన రెండు పుస్తకాలను' ఆవిష్కరించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

మణికొండ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 132లోని ప్రభుత్వ భూమిలో ఇటీవల కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం తెలిసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వాటిని తొలగించాలని ఆదేశించారు. దాంతో గురువారం ఆర్‌ఐలు విక్రంరెడ్డి, సురేష్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది పది వరకు నిర్మాణాల బేస్‌మెంట్లను తొలగించారు.